క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలక మండలి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. ముందుగా వివిధ వార్డు సభ్యులు తమ వార్డుల్లో చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులు తదితర అంశాలను చర్చించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రాధాన్యతను బట్టి పనులు చేస్తున్నట్లు తెలిపారు.

సర్పంచ్‌ను ఆదుకుంటాం..



సాక్షి స్పందన

బచ్చన్నపేట: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బసిరెడ్డిపల్లి సర్పంచ్ బాలగోని పర్శరాములుగౌడ్‌ను అన్ని విధాలుగా ఆదుకుంటామని బీఆర్‌ఎస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 'సర్పంచ్‌ను ఆదుకోండి' తో సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించి పర్శరాములుగౌడ్ కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అందించామన్నారు. అలాగే పర్శరాములును ప్రైవేట్ ఆస్పత్రి నుంచి నిమ్స్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించామన్నారు. నాయకులు పాల్గొన్నారు.

మోసపోయి కష్టాల పాలుకాకండి



లింగాలఘణపురం: గ్రామాల్లో ప్రజలు సులభంగా డబ్బుల సంపాదనపై ఆశపడి మోసపోయి కష్టాల పాలు కావొద్దని సీఐ సంతోష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. నేడు సులభంగా డబ్బులు సంపాదించే స్కీంలు మోసం చేసేందుకు వస్తుంటాయని వాటిని నమ్మొద్దని సూచించారు. అంతేకాకుండా గంజాయి, గుట్కా విక్రయాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీఐతో పాటు ఎస్సై ప్రవీణ్ ఉన్నారు.

రోడ్డు నియమాలు అతిక్రమించొద్దు



దేవరుప్పుల: రోడ్డు నియమాలను అతిక్రమిస్తే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని కామారెడ్డిగూడెం పరిధి జనగామ–సూర్యాపేట రహదారిలో పలు వాహనాలను ఆయ న తనిఖీ చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదా రులు వాహన, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు కలిగి ఉండడమేగాక హెల్మెట్ విధిగా వాడాలన్నారు.

ఆర్థికసాయం



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన తాళ్లపల్లి అంజిబాబు(35) ఆర్థిక ఇబ్బందులతో రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీస్ మిత్ర బృందం తరుపున ఈర్ల నర్సయ్య, శ్యాంసుందర్, రాజేశ్వర్‌రావు, రాజహంస బుధవారం మృతుడి భార్య మంజుల, ఇద్దరు పిల్లలకు రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపదలో ఆదుకున్న పోలీస్ బృందానికి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, ఇల్లందుల సుదర్శన, జనగాం యాదగిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుతో బహుళ ప్రయోజనాలు

దేవరుప్పుల: వరిసాగు చేసే వ్యవసాయ క్షేత్రంలో పచ్చిరొట్ట ఎరువుతో అన్నదాతలు బహుళ ప్రయోజనాలు పొందుతారని దేవరుప్పుల వ్యవసాయ విస్తీర్ణాధికారి సూదగాని సాగర్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా 65 శాతం సబ్సిడీతో కూడిన జీలుగు(ప చ్చిరొట్టె) విత్తనాల లాభాలపై వివరించారు. అతితక్కువ ఖర్చుతో భూసారం పెంచేందుకు తోడ్పడే జీలుగ విత్తనాలను మన ఆగ్రోస్ కేంద్రాల్లో భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు ఇచ్చి సబ్సిడీతో జీలుగు విత్తనాలను పొందగలరని సూచించారు.

ఎక్కడి ధాన్యం అక్కడే..

- మిల్లుల వద్ద కొంత.. కొనుగోలు కేంద్రాల వద్ద మరికొంత
- తూకం వేసినా తరలించని వైనం
- మిల్లర్ల కొర్రీలకు స్పందించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



తూకం వేసి లారీలు రాక నిలిచిన ధాన్యం

లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది. తూకం వేయకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ఒకవైపు మిగిలి ఉండగా మరోవైపు తూకం వేసిన ధాన్యం తరలించకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ఉండగా తరలించిన ధాన్యం మిల్లర్లు హమాలీల కొరతతో దించుకోకపోవడంతో అక్కడే నిలిచిపోతుంది. దీనికి తోడు ధాన్యం మిల్లింగ్‌లో 68 శాతం బియ్యం రావాలనే నిబంధనతో మిల్లర్లు కొర్రీలు పెడుతుంటే అసలు అధికారులు స్పందించడంలేదు. దీంతో రోజులతరబడి మిల్లర్ల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఈ నెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలను మూసివేయాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం తొందరపెడుతున్నంతగా రైతుల సమస్యలను పరిష్కరించడంలో పట్టింపులేకుండా పోతుంది. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 10 కేంద్రాలు, లింగాలఘణపురం, క్లోం పీఏసీఎస్ పరిధిలో 8 కొనుగోలు కేంద్రాలు నిర్వహణ జరుగుతుంది. ఐకేపీ ఆధ్వర్యంలోని పది కేంద్రాల్లో 8,000 బస్తాలు, పీఏసీఎస్‌ల పరిధిలోని 8 కేంద్రాల్లో 11,000 బస్తాలు తూకం వేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయి. లారీలు రాకపోవడం, ట్రాక్టర్లలో తరలిస్తే మిల్లర్లు త్వరగా అన్‌లోడ్ చేయకపోవడంతో వర్షం వస్తే తడుస్తాయని కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు తూకం వేసిన బస్తాలను టపికీలు కొట్టి పరదాలు కప్పుతూ ఇబ్బందులు పడుతున్నారు.



మణికంఠ రైస్‌మిల్లు వద్ద నిలిచిన లారీలు, ట్రాక్టర్లలోని ధాన్యం

మూడు రోజులుగా మిల్లు వద్దనే ఉంటున్నాం..



మండలంలోని నెల్లుట్ల మణికంఠ రైస్‌మిల్లు వద్ద మూడు రోజులుగా ఉంటున్నాం. సొంతంగా ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకొస్తే అవుటర్ వేసి, అంటే బియ్యం శాతం ఎంత వస్తున్నాయో చూసి ఈ ధాన్యం తమకు వద్దని మిల్లరు అంటున్నాడు. యాసంగి కావడంతో కొంత నూకలు ఉన్నాయి. ఏ అధికారికి చెప్పినా ఎవరూ రావడంలేదు. మూడు రోజులుగా ఎదురు చూస్తున్నాం.

\- కుంటి నర్సింగరావు, రైతు, లింగాలఘణపురం

బియ్యం శాతం రావడంలేదు.. మేమేం చేయాలి

బియ్యం శాతం 68 రావాలి. అంటే క్వింటాల్ ధాన్యం మిల్లింగ్ చేస్తే 68 కిలోల బియ్యం రావాలి. కొందరికి ధాన్యం 58 శాతం మాత్రమే వస్తున్నాయి. నష్టానికి మేము దించుకోం. అధికారులు వచ్చి ఏం చెబితే అదే చేస్తాం..అప్పటి వరకు ధాన్యం దించుకోం.

\- అంకారావు, యజమాని, మణికంఠ రైస్ మిల్లు

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ హరిప్రసాద్

తరిగొప్పుల: పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్ , వ్యవసాయ శాఖ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం అకాల వర్షం కారణంగా నీటి పాలు కాకుండా, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించే బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. ఎస్సై దూదిమెట్ల రమేష్, ఏపీఎం కుమారస్వామి, ఆర్ఐ రవీందర్, పలువురు పాల్గొన్నారు.

దుర్గామాతకు మంత్రి ఎర్రబెల్లి పూజలు



పాలకుర్తి టౌన్: మండలంలోని ముత్తారంలో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాల్లో బుధవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని పూజలు చేశారు. మంత్రి వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎర్రబెల్లి రాఘవరావు, సర్పంచ్ కల్వల భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది ఉపేందర్, కునూరు కృష్ణమూర్తి,మహేందర్, భూమ రంగయ్య, గ్యార కొమురయ్య, అంజయ్య, కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఒగ్గు బీర్ల పూజారులు బీరప్ప దేవుడు, గారడి వేషాలు వేసుకొని పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు మాట్లాడుతూ కథలను చెప్పే క్రమంలో ఈ గారడి వేషాలకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. గారడి వేషంలో ఉన్న వారు మాయలను, మ్యాజిక్‌లను చేసి చూపిస్తారని తెలిపారు. కుల పెద్దలు, ఒగ్గు బీర్ల కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలోని ఫర్టిలైజర్ షాపులు విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, షాపుల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ రాకేష్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, షాపుల వద్ద స్టాక్, ధరలతో కూడిన పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీల్లో స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ రాజేందర్, ఘన్‌పూర్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఓ దీప్తి పాల్గొన్నారు.

పుస్తెమట్టెల అందజేత



పుస్తెమట్టెలు అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్

దేవరుప్పుల: పెద్దమడూరులో మేడ సోమల్ల, ఎల్లయ్య దంపతుల కూతురు రేణుక వివాహమహోత్సవానికి సామాజిక నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ సౌజన్యంతో సమన్వయకర్త కారుపోతుల శ్రీనివాస్ చేతుల మీదుగా ఆర్థిక సాయంతోపాటు పుస్తెమట్టెలను బుధవారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి బాసటగా నిలుస్తున్న శ్రీకాంత్‌గౌడ్ దాతృత్వం పట్ల సర్పంచ్ ఆకవరం స్వజనాపెద్దారెడ్డి అభినందనలు తెలిపారు. ఎంపీటీసీ పానుగంటి గిరి, రైతు కోఆర్డినేటర్ పెద్దారెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్,గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి రాములు, ఉప సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

పాలకుర్తి: బ్యాంకు సేవలను కస్టమర్లు వినియోగించుకోవాలని భువనగిరి డివిజన్ ఏపీజీవీబీ ఆర్ఓ, ఆర్ఎం బి. వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం పాలకుర్తి ఏపీజీవీబీ వికాస్ బ్యాంకు బ్రాంచ్ తరపున మంద రజిత ఆధ్వర్యంలో ప్రింటింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని కస్టమర్లకు బ్యాంకు సేవలు అందించాలని పాసుబుక్ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభించామన్నారు. కస్టమర్లు పాస్‌బుక్ ప్రింటింగ్, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయించుకునే అవకాశం ఉందని అన్నారు. నోడల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, ఏపీజీవీబీ మేనేజర్ బాదం సిందూజ , మదు కుమార్, గడ్డం సుధాకర్, సర్పంచ్ మంద కొమురయ్య, ఉప సర్పంచ్ అరుణ, ఈరవెన్ను గ్రామ బ్యాంకు మిత్ర అనుమల కుమార్, బమ్మెర బ్యాంకు మిత్ర కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



చిల్పూరు: మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

చిల్పూరు: ఈనెల 26వ తేదీన మండలంలోని పల్లగుట్టలో నిర్వహించే మల్కాపూర్ క్లస్టర్–2 బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు పిలుపునిచ్చారు. ఆత్మీయ సమావేశంపై బుధవారం మండలంలోని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీ ధర్‌రావు ఆధ్వర్యంలో సభ ఇన్‌చార్జ్‌లు ఆకుల కుమార్, పసునూరి మహేందర్‌రెడ్డి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, భూక్య రమేష్‌నాయక్, కంకటి రవీందర్, తీగల మహేందర్, మాలోత్ రమేష్‌నాయక్, రంగు రమేష్, వెంకటస్వామి, గట్టయ్య, రాజన్‌బాబు, హరిబాబు పాల్గొన్నారు.

27న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కొడకండ్ల: ఈ నెల 27న ఏడునూతులలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ తెలిపారు. బుధవారం ఏడునూతులలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ సారథ్యంలో గడిచిన తొమ్మిదేళ్లలో ఎనలేని ప్రగతి సాధించిందని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ఇంటింటికి తీసుకెళ్లాలని కోరారు. ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ఏడునూతుల, రంగాపురం, నర్సింగాపురం , రేగుల, రేగులతండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, సర్పంచ్ సైదులు, బ్రహ్మచారి, సోమన్న, లింగయ్య, వెంకన్న, కిషన్, ఇంద్రారెడ్డి, నాజర్, మధు, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ పద్మ

దేవరుప్పుల : అభాగ్యులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని సర్పంచ్ వంగ పద్మ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నమడూరులో మంత్రి దయాకర్‌రావు సహకారంతో మంజూరైన ముగ్గురికి సీఎం సహాయ నిధి, ఆరుగురికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. రాజకీయాలకతీతంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉపసర్పంచ్ కంకటి యాదగిరి, వార్డు సభ్యులు నవనీత, మంజుల, భాస్కర్, బీఆర్‌ఎస్ మండల నాయకులు వంగ అర్జున్, గ్రామ అధ్యక్షుడు సంతోష్, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాలకు లారీల తరలింపు

స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు పడుతున్న ఇబ్బందులపై స్పందించిన అధికారులు జాతీయ రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంపిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌లో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్ తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, సీఐ రాఘవేందర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సైమ, ఎంఆర్ఐ రవీందర్ తదితరులు ఘన్‌పూర్ శివారులో జాతీయ రహదారిపై వెళ్తున్న ఖాళీ లారీలను ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు వాహనాల కొరతతో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు జాప్యం జరుగుతుందన్నారు. అందుకే రోడ్డుపై వెళ్తున్న ఖాళీ లారీలను ఆపి లారీ డ్రైవర్లతో, అవసరమైతే వారి యజమానులతో మాట్లాడి వీఆర్ఏలను లారీలలో ఎక్కించి వాహనాలను కొనుగోలు సెంటర్లకు పంపించినట్లు తెలిపారు. వీఆర్‌ఏలు అనీల్, శివ, అభి, వెంకటరాజ్యం పాల్గొన్నారు.



లారీలను ధాన్యం కేంద్రాలకు పంపిస్తున్న తహసీల్దార్, సీఐ

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కొడకండ్ల: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్ నిర్ణయంపై జేపీఎస్‌లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్‌నాయక్, సూపరింటెండెంట్ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, సోమేశ్, సందీప్, స్వరూప, రత్నమాల, బయ్యన్న రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

పండుగలు సమైక్యతకు దోహదపడతాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

బచ్చన్నపేట: హిందువులు నిర్వహించుకునే పండుగలు సమైక్యతకు దోహదపడతాయని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై దేవతలకు ప్రత్యేక పూజ చేశారు. రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, సర్పంచ్ మాసపేట రవీందర్ రెడ్డి, కురుమ సంఘం నాయకులు వస్పరి నర్సింహులు, పరిదె కొమురయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జనగామ రూరల్: పట్టణానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు గోల్లాడ సంపత్ భార్య మాధవి రెండు కిడ్నీలు చెడిపోయి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, ఆపరేషన్ అవసరమవడంతో పానుగంటి ప్రవీణ్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సీఎంతో మాట్లాడి రూ.5 లక్షల ఎల్‌ఓసీని బుధవారం అందజేశారు. నాయకులు లెనిన్, కల్యాణ్, నర్సింగ్, రాజు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నా సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇందిర బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు దోపిడి చేస్తున్నారని, వాహనాల తరలింపులో జాప్యం చేస్తున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల రెండు వారాలుగా ధాన్యం కాంటా కాకపోవడంతో ఒక రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడనే విషయం రైతుల ద్వారా తెలుసుకుంది. అనంతరం ఆమె మాట్లాడుతూ మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, ఇంత జరుగుతున్నా పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేపట్టాలని, అవినీతికి పాల్పడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యానికి రైతులకు ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, యూత్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింత ఎల్లయ్య, కోరుకొప్పుల మహేందర్‌గౌడ్, సింగపురం వెంకటయ్య, సింగపురం నాగయ్య, శ్రీనివాస్, జ్యోత్స్న, ప్రశాంతి, రాజ్‌కుమార్, వసంత్, రాంచందర్ పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు

చిల్పూరు: గ్రామానికి దుర్గామాత ఆశీస్సులు ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. ఫతేపూర్‌లో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాల్లో బుధవారం ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట ఊమ్లానాయక్, బాలరాజు, రవినాయక్, తిరుపతి, యాకయ్య, హుస్సేన్ ఉన్నారు.

తీరనున్న విద్యుత్ లైన్ల సమస్య



ఏఈకి చెక్కు అందజేస్తున్న సర్పంచ్ సురేష్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏళ్లతరబడిగా వ్యవసాయానికి సంబంధించిన 11 కేవీ విద్యుత్ లైన్లు గృహాల మీదుగా ఉండగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 20 సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ ప్రత్యేక చొరవతో విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించేందుకు ఎస్టిమేషన్‌ను వేయించారు. ఇందుకుగాను గ్రామ పంచాయతీ నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.5,61,709 చెక్కును స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఘన్‌పూర్ ఏఈ పులి చంద్రమోహన్‌కు సర్పంచ్ సురేష్‌కుమార్ బుధవారం అందించారు. శివునిపల్లి లైన్‌మన్ కాల్‌రామ్ నాయక్, ఈఓ సత్యనారాయణ, ఎంపీటీసీ సింగపురం దయాకర్, ఉపసర్పంచ్ నీల ఐలయ్య, వార్డు సభ్యులు, ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాలలో జరుగుతున్న ఈజీఎస్ పనులను జాబ్ కార్డు కలిగి ఉన్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి ఈజీఎస్ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం పనులకు వెళ్లి తొందరగా ఇంటికి రావాలన్నారు. కూలీలు సమయ పాలన పాటించాలన్నారు. టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరచాలి



మాట్లాడుతున్న సురేష్

పాలకుర్తి టౌన్: ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను కనబరచాలని కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ బొట్టు సురేష్ సూచించారు. బుధవారం మండలంలోని శాతాపురంలో విద్యార్థులకు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్య ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు ఒక స్పష్టమైన లక్ష్యం, మార్గనిర్దేశం లేకవపోడంతో తమ అందమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు ఆదర్శవంతమైన గొప్ప జీవితం గడిపేందుకు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మల్యాల లక్ష్మణ్, బొట్టు శ్రీధర్, పసులాది ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

దేవరుప్పుల : మండలంలోని నల్లకుంట తండాకు చెందిన వాంకుడోత్ బికిరి మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబానికి సర్పంచ్ బానోత్ రాజన్న నాయక్ దహన సంస్కారాలకు రూ.2,500 ఆర్థికసాయంతో పాటు 50కిలోల బియ్యాన్ని అందజేశారు. సంతోష్ ,సుందర్, సోమ్లా, భోజ్యా నాయక్, గోరమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.